

ఆధునికీకరణ పూర్తయ్యేదెప్పుడో!

బాసర రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోంది. రెండేళ్లయినా నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో యాత్రికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 8లో▸



నూతన బదిలీ విధానం రద్దు చేయాలి

సింగరేణి యాజమాన్యం నూతన బదిలీ విధానం బేషరతుగా రద్దు చేయాలని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0 /28.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కార్మిక చట్టాల సవరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని జాతీయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా మంగళవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ దేశ సంపదకు కారకులయ్యే కార్మికులకు హక్కులు లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్పు చేసిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, లేబర్‌కోడ్‌ల రద్దు కోసం జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, నాయకులు ఖలిందర్ అలీఖాన్, దొడ్డిపట్ల రవీందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, శ్రీనివాస్, రాములు ప్రభాకర్, సీఐటీయూ జిల్లా నాయకులు ప్రకాష్, టీయూసీఐ నాయకులు దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రగతిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: పాఠశాల ప్రగతిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని డీఈవో యాదయ్య అన్నారు. మంగళవారం గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెండో విడత ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. టీచర్ల సమన్వయంతో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యనందించేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలలో అన్ని రకాల కార్యక్రమాలపై ప్రధానోపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని, శిక్షణ కార్యక్రమంలో చర్చించే విషయాలను చక్కగా అమలు చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో తొమ్మిది పాఠశాలల్లో నిర్వహిస్తున్న రెండో విడత టీచర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయా సబ్జెక్టులకు చెందిన 897మంది టీచర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోర్సు సెంటర్ ఇంచార్జి క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, రిసోర్సు పర్సన్లు సాంబమూర్తి, రాజు, గిరిధర్ రెడ్డి, దత్తకుమార్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

‘మాదిగలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలి’



మాట్లాడుతున్న సునీల్ మాదిగ

బెల్లంపల్లి: మాదిగ హక్కుల సాధన ధ్యేయంగా మరో ఉద్యమానికి సిద్ధం కావాలని మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్‌మాదిగ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ, రాజకీయ రంగాల్లో న్యాయమైన వాటా దక్కాల్సిన అవసరం ఉందన్నారు. ఏళ్ల తరబడి నుంచి సరైన వాటా దక్కకుండా మాదిగలు, ఉపకులాలు ఎన్నో రకాల వేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో లెదర్ పార్కుల పునరుద్ధరిస్తే లక్షలాది మంది మాదిగలకు ఉపాధి లభిస్తుందని, ఈ విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకుని నిధులు కేటాయించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం సంఘం నూతన పట్టణ కమిటీ, నియోజకవర్గ ఇంచార్జి, కన్వీనర్, కో కన్వీనర్‌లతోపాటు బెల్లంపల్లి, కన్నెపల్లి మండలాల కన్వీనర్లను నియమించారు. సీనియర్ నాయకుడు కాంపల్లి రాజంను రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలాల రమేష్, జిల్లా అధ్యక్షుడు కడారి రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాతరి కిరణ్, నాయకులు కుక్కపల్లి రాజలింగు, దాసరి బానయ్య, కాంపల్లి సతీష్, ఎనగందుల నరేష్, గద్దల కుమార్, అంబాల రాజేందర్, ఆయిళ్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆ భూమిని పేదలకు పంచుతాం

- ‘ధరణి’ని దొరల చుట్టంగా మార్చారు
- పైలట్ మండలాల్లో అర్జీలు పరిష్కరిస్తున్నాం
- జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి అమలు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేదికపై ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/భీమారం: అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని తిరిగి పేదలకు పంచుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆనాటి దొరలు చట్టాన్ని చుట్టంగా ఉపయోగించుకుని అన్యాక్రాంతం చేశారని విమర్శించారు. ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు జూన్ 2న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హక్కులు కల్పిస్తామని ప్రకటించారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, అటవీ సమస్యల పరిష్కారం కోసం సర్వే చేయిస్తామని అన్నారు. రాష్ట్రంలో మొదట నాలుగు జిల్లాల్లో నాలుగు మండలాలు, 28జిల్లాల్లో 32 పైలట్ మండలాల్లో భూ సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. భీమారం మండలంలో 2200దరఖాస్తుల వచ్చాయని, ఇందులో 1100 సాదాబైనామాలకు సంబంధించినవి ఉన్నాయని, వీటిని కోర్టు సెలవుల అనంతరం పరిష్కరిస్తామని తెలిపారు. సరిహద్దుల సర్వే చేసి, మ్యాపులతో రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతీ రైతన్నకు భూ ఆధార్‌ను కల్పిస్తామన్నారు. ధరణిలో తప్పులు సరిదిద్దే అవకాశం లేదని, భూభారతిలో ఎమ్మార్వో నుంచి సీసీఎల్ వరకు అధికారాలు కల్పించామని అన్నారు. గతంలో దరఖాస్తులకు రూ.వెయ్యి చొప్పున తీసుకున్నారని, గ్రామాలకే రెవెన్యూ అధికారులు వచ్చి ఉచితంగా పరిష్కరిస్తారని తెలిపారు. ఏ అధికారైనా రైతన్నను ఇబ్బంది పెడితే ఆ అధికారిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. నలుగురి కోసం తయారు చేసిన చట్టంలా కాకుండా అందరికీ అందుబాటులో ఉండేలా తెచ్చామన్ని, ఈ చట్టాన్ని అమలు చేసే బాధ్యత అధికారులపైనే ఉందని అన్నారు. ఆరు నెలలుగా అధ్యయనం, లక్షలాది మంది అభిప్రాయాలు సేకరించి, చట్టం చేశామని, జూన్ 2నుంచి రాష్ట్రమంతటా అమలు చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదోడి పక్షపాత ప్రభుత్వమని, రాష్ట్రంలో 4.50లక్షలు ఇందిరమ్మ ఇళ్లు మొదలు పెట్టగా, కొన్ని చోట్ల ఈ నెలాఖరులో గృహ ప్రవేశం కానున్నాయన్నారు. రాబోయే రోజుల్లో 20లక్షల ఇళ్లు కట్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని గుర్తు చేశారు. అంతకుముందు స్థానిక రైతులు ప్రభుత్వ, అటవీ, కబ్జా కాలంలో సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుగా, పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ సదస్సులో ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, గిరిజన ఆర్థిక సహకార శాఖ చైర్మన్ కోట్నాక తిరుపతి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, అడిషనల్ కలెక్టర్ మోతీలాల్, తదితరులు పాల్గొన్నారు.

భూమాఫియా రెచ్చిపోయింది..

– చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్



కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా రాష్ట్రంలో భూమాఫియా రెచ్చిపోయింది. పాస్‌పుస్తకాల్లో అనుభవదారుల పేర్లు తీసేశారు. వేలాది మంది రైతులు ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్ నాయకులు భూదందాలకు పాల్పడ్డారు. ఇప్పుడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి ద్వారా సామాన్య రైతులకు న్యాయం జరుగుతుంది. చెన్నూరు నియోజకవర్గంలో భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తాం. నియోజకర్గంలో ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం. టార్పాలిన్ కవర్లు వేసుకొని జీవిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

గతంలో రికార్డులు మార్చారు

– బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



గతంలో గ్రామాల్లో నివసించే రైతుల రెవెన్యూ రికార్డులు కొందరు మార్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ధరణితో సామాన్య రైతులు నానా పాట్లు పడ్డారు. అటవీశాఖ అధికారులు సహకరిస్తే చాలా వరకు సమస్యాత్మకంగా ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయి. అటవీ, రెవెన్యూ శాఖలు కలిసి సమస్యలు పరిష్కరించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా కార్యకర్తలు ప్రచారం చేయాలి. బటన్ నొక్కగానే పనులు కావాలనే ఉద్దేశంలో ప్రజలు ఉన్నారు. పనులు ప్రభుత్వం నిర్దేశించిన నియమాల ప్రకారం జరుగుతాయని ప్రజలు అర్థం చేసుకోవాలి.



సదస్సులో పాల్గొన్న మహిళలు

మంత్రికి ఘన స్వాగతం

జైపూర్: జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్‌లో మంత్రి జైపూర్ పవర్ ప్లాంటుకు చేరుకోగా స్థానిక ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసు పుష్పగుచ్ఛాలు అందజేసి పూలమాలు, శాలువాలతో సన్మానించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా భీమారంలో నిర్వహించిన సదస్సుకు హాజరయ్యారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా టీఎన్జీవోస్ నాయకులు కోరారు. మంగళవారం జిల్లాకు వచ్చినను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గ డియారం శ్రీహరి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు ఉన్నాయని, మంచిర్యాల మున్సిపాలిటీ ఇటీవల కార్పొరేషన్‌గా ఉన్నతీకరణ జరగ్గా, ఇక్కడి ఉద్యోగులకు నూతన హెచ్‌ఆర్‌ఏ ప్రకటించాలని పేర్కొన్నారు. చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఇతర 57డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సంఘం కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేజియారాణి, రామ్‌కుమార్, నరేందర్, తిరుపతి, సంయుక్త కార్యదర్శి సునీత, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, మందమర్రి యూనిట్ అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 22 నుంచి 28వ రకు ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో డీఐఈవో అంజయ్య, డీఈవో యాదయ్యతో కలిసి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్ పరీక్షకు 3,222 మంది, ఒకేషనల్ పరీక్షకు 296 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షకు 1,740 మంది, ఒకేషనల్ పరీక్షకు 235 మంది మొత్తం 5,514 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష నిర్వహణకు డీఐఈవో, సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ లెక్చరర్ ఆధ్వర్యంలో జిల్లా పరీక్ష కమిటీ ఏర్పాటు చేశామని, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, మంచిర్యాల పరిధిలోని పరీక్ష కేంద్రాలకు ఇద్దరు కస్టోడియన్లను నియమించామని తెలిపారు.

కార్మిక శాఖలో కక్కుర్తి!

కార్మిక శాఖ జిల్లా కార్యాలయంలో సిబ్బంది ఒకరు దొనబంద నుంచి వచ్చిన ఓ యువకుడి వద్ద నుంచి డబ్బులు తీసుకునే ప్రయత్నం చేశారు. బాత్రూంకు వెళ్లినట్లుగా ఇద్దరు వెళ్లి అక్కడ డబ్బులు ఇవ్వాలని సూచించగా, ఆ యువకుడు తన పర్సులో నుంచి నగదు తీస్తుండగా ‘సాక్షి’ ఫొటోలు తీసింది. వెంటనే అప్రమత్తమై ఇద్దరు హుటాహుటిన బయటకు వచ్చారు. దీంతో ఆ ఆఫీసు నుంచి మరో అధికారి వచ్చి ఫొటోలు ఎందుకు తీస్తున్నవంటూ రిపోర్టర్‌నే బెదిరించే ప్రయత్నం చేశారు. రిపోర్టర్ కార్డు చూపించు అంటూ రుసరుసలాడారు. మరోవైపు ఆ యువకుడు ఆ రిపోర్టర్ తనకు తెలియదని చెప్పినా, వినకుండా ‘నీ పని చేయం’ అంటూ బెదిరించసాగారు. ఈ ఘటన సాక్షాత్తు జిల్లా కలెక్టరేట్‌లోనే మంగళవారం చోటు చేసుకుంది.

- పైసలు ఇస్తేనే పని అన్నట్లుగా తీరు
- సేవలు పొందాలంటే ముట్టజెప్పాల్సిందే
- పేద, బలహీన వర్గాలనూ వదలని సిబ్బంది



డబ్బులు ఇవ్వబోతూ ఆగిపోయిన యువకుడు



జిల్లా కార్మిక శాఖ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం అవినీతి లేని ప్రజాపాలన అందించాలనే సదాశయంతో పని చేయాలని అధికారులను కోరుతోంది. అయితే కొందరు అధికారులు మాత్రం ప్రభుత్వ సేవలను పొందాలంటే ప్రజల నుంచి డబ్బులు అందితేనే తమ విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంతకాలంగా జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో జరుగుతున్న వసూళ్ల అవినీతి తీరును బయటపెడుతోంది. జిల్లాలో రిజిష్టర్ పొందిన కార్మికులు తమకు అందే ప్రయోజనాల సేవలకు వస్తున్న వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. తాజా ఘటనలోనూ గుర్తింపు పొందిన ఓ కార్మికుడి కూతురు ప్రసవమైతే వచ్చే రూ.30వేల ఆర్థిక సాయంపై ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నాడు. జిల్లా కార్యాలయంలో దీనిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ చేసేందుకు కార్మికుడి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. తమ పని చేస్తే చాలు అన్నట్లుగా ఎవరూ బయటపడడం లేదు.

పని చేసేందుకు పైసలు

మంచిర్యాల జిల్లా పరిధిలో మంచిర్యాల–1, 2, బెల్లంపల్లి మూడు సర్కిళ్లలో మొత్తం దాదాపు 65వేల మంది కార్మికులు రిజిష్టర్ చేసుకున్నారు. చాలామంది ఏటేటా గుర్తింపు కార్డులను రెన్యూవల్ చేసుకోవడం లేదు. ఇందులో 45వేల పైగా కార్మికులే గుర్తింపు పొందారు. ఇందులో అధికంగా భవన నిర్మాణ రంగ కార్మికుల వారు ఉండగా, మిగతా వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు ఉన్నారు. గుర్తింపు పొందిన కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కుటుంబాల్లో పిల్లలకు స్కాలర్‌షిప్పులు, పెళ్లి, మెటర్నిటీ, రోడ్డు ప్రమాదాలు, వైకల్యం, సహజ మరణాలు, ఆసుపత్రి, దహన సంస్కారాలకు ఆర్థిక సాయం, తదితర పలు ప్రయోజనాలు ఉంటాయి. ఇందులో పేద వర్గాలకు చెందిన వారే గుర్తింపు కార్మికులుగా ఉండగా, వారికి ప్రయోజనాలు కల్పించాల్సిన అధికారులే పైసలకు కక్కుర్తి పడుతూ వారికి సాయం చేసే బదులు వారి నుంచే డబ్బులు వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది.

రెగ్యులర్ అధికారి లేక

జిల్లాలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఆఫీసులో సిబ్బంది వ్యవహారం ఇష్టారీతిన సాగుతోంది. కింది స్థాయి కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి సర్కిల్ ఆఫీసర్ల దాక ఆడిందే ఆటలా మారింది. కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌కే జిల్లాకు పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించడంతో పర్యవేక్షణ కొరవడింది. కార్యాలయంలో డబ్బుల వసూళ్లపై జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఎఫ్ఏసీ) వెంకటరమణను ‘సాక్షి’ సంప్రదించగా.. డబ్బులు వసూలు చేస్తున్న విషయం తన దృష్టికి రాలేదని, ఆఫీసులో అడిగి తెలుసుకుంటానని తెలిపారు.

‘గిరి’ రైతులకు చేయూత

- పోడు భూముల్లో సాగుకు సర్కారు తోడ్పాటు
- ‘ఇందిర సౌర జల వికాసం’తో ముందడుగు
- ఉమ్మడి జిల్లాలో పలువురికి చేకూరనున్న లబ్ధి
- డిప్యూటీ సీఎం చేతుల మీదుగా ఈ వారంలో ప్రారంభం
- ఏర్పాట్లపై ఐటీడీఏ దృష్టి



ఉట్నూర్ ఐటీడీఏ

సాక్షి, ఆదిలాబాద్: పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు చేయూత అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారి కుటుంబ ఆదాయం రెట్టింపు చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోంది. సమగ్ర భూమి అభివృద్ధి పనులతో పాటు సౌర విద్యుత్‌తో కూడిన సాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఇందిర సౌర గిరి జల వికాసం అనే ప్రత్యేక పథకాన్ని రూపొందించింది. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో ఈ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ ఈ పథకాన్ని ఈ వారంలో లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు ఈమేరకు లబ్ధి చేకూరనుంది.

కలెక్టర్ ఆధ్వర్యంలో అమలు..

రాష్ట్ర ప్రభుత్వం గతంలో అనేక మంది గిరిజన రైతులకు అటవీ హక్కుల చట్టం కింద పోడు వ్యవసాయం చేసుకునేందుకు భూ యాజమాన్య హక్కును కల్పించింది. ఆ భూముల్లో రాబోయే ఐదేళ్లల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రస్తుతం సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగా సోమవారం నల్లమల డిక్లరేషన్ ప్రకటించింది. గిరిజనుల సంక్షేమం కోసం పలు అంశాలను ఇందులో పొందుపర్చారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం సంక్రమించిన పోడు భూములకు ఈ పథకంతో లబ్ధి చేకూర్చాలని నిర్ణయించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.

లబ్ధి ఇలా..

పోడు భూముల్లో వంద శాతం సబ్సిడీతో సమగ్ర భూమి అభివృద్ధి పనులతో పాటు సౌర విద్యుత్‌తో కూడిన సాగునీటి సౌకర్యం కల్పిస్తారు. తద్వారా ఆ భూములను సాగుకు యోగ్యంగా మార్చి గిరి రైతు కుటుంబాల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇదిలా ఉంటే.. ఉమ్మడి జిల్లాలో బోరుబావుల స్థానంలో చేతిబావులు తవ్వించాలని ఐటీడీఏ నిర్ణయించింది. దీనికి ఇందిర సౌరజల వికాస పథకం ద్వారా సౌర పలకలు బిగించనున్నారు.

అర్హులు వీరు..

అటవీ హక్కు చట్టం కింద జారీ చేయబడిన భూ యాజమాన్యం హక్కు కలిగిన ప్రతీ గిరిజన రైతును అర్హులుగా నిర్ణయించారు. సదరు రైతుకు రెండున్నర ఎకరాలు(హెక్టారు), అంతకంటే ఎక్కువ ఉంటే ఒక యూనిట్‌గా మాత్రమే మంజూరు చేస్తారు. అంతకంటే తక్కువ విస్తీర్ణం కలిగి ఉన్నట్లయితే సరిహద్దులో గల ఇద్దరి నుంచి ఐదుగురిని గ్రూప్‌గా ఏర్పాటు చేసి యూనిట్‌గా మంజూరు చేయనున్నారు. ఒకవేళ సరిహద్దులో అటువంటి రైతుల భూములు లేనిపక్షంలో ఆ రైతుకు వ్యక్తిగతంగా యూనిట్ మంజూరు చేసేలా ఇందులో ప్రణాళిక చేశారు.

శాఖల సమన్వయం..

గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ ఇందులో అటవీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, భూగర్భజల, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సమన్వయంతో ముందుకెళ్తున్నారు. తద్వారా వివిధ అభివృద్ధి పనులు పోడు భూముల్లో చేపట్టనున్నారు.

అభివృద్ధి పనులు ఇవి..

- ఈ పథకం కింద వివిధ అభివృద్ధి పనులు పోడు భూముల్లో చేపట్టనున్నారు.
- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద భూమి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.
- ఈ భూముల్లో భూగర్భ, నీటి సర్వే చేపట్టి రైతుకు లబ్ధి చేకూరేలా చేతిబావులు తవ్వకం చేపడుతారు.
- 5 హెచ్‌పీ, 7.5 హెచ్‌పీ సోలార్ పంపుసెట్లు, సోలార్ ప్యానళ్ల ఏర్పాటు ద్వారా విద్యుత్ అందించి సాగునీటి సౌకర్యం కల్పిస్తారు.
- వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాలు, యాంత్రీకరణకు సహకారం అందించనున్నారు.
- ఉద్యానవన శాఖ ద్వారా మెరుగైన నీటి యాజమాన్యం కోసం డ్రిప్, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో గిరి తెగల జనాభా.. (2011 జనాభా లెక్కల ప్రకారం)

గోండు:	2,63,515
లంబాడా:	1,12,793
కొలాం:	38,176
కోయ, ఇతరులు:	30,739
పర్ధాన్:	26,029
మన్నెవార్:	15,370
నాయక్‌పోడ్:	5,206
తోటి:	2,231
ఎరుకల:	1,735
మొత్తం జనాభా:	4,95,794

పోడు భూముల వివరాలు..

విస్తీర్ణం: 2,12,256 ఎకరాలు

రైతుల సంఖ్య:	పట్టాల జారీ సంఖ్య:
66,839	66,839

డిప్యూటీ సీఎం రానున్నారు..



ఇందిర సౌర జల గిరి వికాస పథకాన్ని జిల్లాలో లాంఛనంగా ప్రారంభించేందుకు ఈ వారంలో ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. దీనికి సంబంధించి వేదికను ఖరారు చేస్తున్నాం. జిల్లాలో ఎంత మందికి లబ్ధి చేకూరుతుందనేది పథకం ప్రారంభించిన తర్వాత స్పష్టం అవుతుంది. – ఖుష్బూ గుప్తా, పీవో, ఉట్నూర్ ఐటీడీఏ

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ పంట మార్పిడి చేసుకోవాలని, నీటిని ఆదా చేసి భవితరాలకు అందించాలని సూచించారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు, తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చు తగ్గించడం, అవసరం మేరకు రసాయనాలు వినియోగించడం, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, రశీదులను భద్రపర్చడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏడీఏ రాజానరేంద్ర, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రియా సుగంధి, నాగరాజు, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్, ఏఈవోలు ప్రతిభ, రమ్య, మ్యాట్రిక్స్ ఆయిల్ పాం కంపెనీ సీఈవో ఉదయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎడ్లు తరలిస్తున్న వాహనాల పట్టివేత



పట్టుబడిన వాహనంతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మండలంలోని 63వ జాతీయ రహదారిపై పార్‌పల్లి సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి డీసీఎం వ్యాన్‌లో నిజామాబాద్‌కు 26 ఎడ్లు, జనగామ నుంచి ధర్మారానికి బొలెరో వాహనంలో నాలుగు ఎడ్లను సరైన పత్రాలు లేకుండా తరలిస్తుండగా ఎస్సై రాజేందర్ పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు, ఎడ్లను గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: మనస్తాపంతో చెరువులో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా గుర్జమన్నూరు గ్రామానికి చెందిన ఆశిష్ (32) నిర్మల్‌లో బంధువుల వద్ద ఉంటూ కూలీ పనికి వెళ్తూ జీవిస్తున్నాడు. ఆశిశ్‌కు గతంలో వివాహమైంది. ఆ తర్వాత విడాకులయ్యాయి. దీంతో ఆశిష్ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం తెల్లవారుజామున మనస్తాపంతో స్థానిక బంగాల్‌పేట్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

భైంసాటౌన్: పట్టణంలో మరో ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసినట్లు సీఐ గోపీనాథ్ తెలిపారు. పాత కేసులో నిందితులుగా ఉన్న తురాబ్, షేక్ అలీం అలియాస్ అట్టు కొద్దిరోజులుగా పరారీలో ఉన్నారు. మంగళవారం స్థానిక బైల్‌బజార్ ప్రాంతంలో ఉన్నారన్న పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి 1,250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

యువతిని వేధించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన వేణు ఓ యువతి వెంటబడుతూ సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశాడు. దీంతో బాధితురాలు షీటీమ్‌ను ఆశ్రయించింది. షీటీమ్ సభ్యులు నిందితుడిని బస్టాండ్ సమీపంలో మంగళవారం పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశారు. ఫోన్ సీజ్ చేశారు.

ఆధునికీకరణ పూర్తయ్యేదెప్పుడో!

- రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో జాప్యం
- దుమ్ముతో నిండిన ప్లాట్‌ఫాంలు
- రెండేళ్లయినా పూర్తి కాని నిర్మాణాలు
- ఇబ్బందుల్లో బాసర యాత్రికులు



షెడ్లు లేని బాసర రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలు



పిల్లర్ దశలో విశ్రాంతి గదుల నిర్మాణ పనులు

భైంసా: అమృత్ భారత్ పథకం కింద చేపట్టిన బాసర రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు రెండేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్నాయి. నిత్యం వేల సంఖ్యలో బాసరలోని సరస్వతీ అమ్మవారి దర్శనానికి వస్తున్న యాత్రికులకు ఇబ్బందులు తప్పడంలేదు. బాసర రైల్వేస్టేషన్ తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దున ఉండడం, ఇక్కడ శ్రీజ్ఞానసరస్వతీ ఆలయంతోపాటు ట్రిపుల్‌ఐటీ ఉండటంతో ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటోంది. అమృత్ భారత్ కింద ఎంపికైన బాసర స్టేషన్ ఆధునికీకరణ పనులను 2024 ఫిబ్రవరి 26న అప్పటి ఎంపీ సోయం బాపూరావు, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కేంద్రం అమృత్ భారత్ నిధులు మంజూరు చేసినా పనులు నత్తనడకన సాగుతుండటంతో వీరికి ఇబ్బందులు తప్పడం లేదు. ఆధునికీకరణలో భాగంగా స్టేషన్‌లో వెయిటింగ్ హాల్, టాయిలెట్స్ నిర్మాణం, ఎస్కలేటర్, లిఫ్ట్ ఏర్పాటు పనులు చేస్తున్నారు. స్టేషన్‌లో యాత్రికులు సేదతీరేందుకు విశ్రాంతి గదుల నిర్మాణం చేపట్టగా ఇప్పటికీ పునాది దశలోనే ఉన్నాయి. రైల్వేస్టేషన్ ముందు భాగాన్ని సుందరంగా తీర్చిదిద్దాల్సి ఉండగా ప్రస్తుతం ఇసుక, కంకర, మట్టి కుప్పలతో నిండిపోయి కనిపిస్తోంది.

పాత ప్లాట్‌ఫాంలు తొలగించి..

ఆధునికీకరణలో భాగంగా బాసర స్టేషన్ పాత ప్లాట్‌ఫాంలు తొలగించారు. మళ్లీ టైల్స్ వేసి పూర్తిగా ఆధునికీకరిస్తున్నారు. రెండు వైపులా ఈ పనులు అర్ధంతరంగా నిలిచాయి. స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫాంలుండగా ఇరువైపులా పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు నిలబడే పరిస్థితి లేదు. ప్లాట్‌ఫాంలపై వివిధ బోగీలను సూచించే ఎలక్ట్రానిక్ మానిటర్లు తొలగించారు. ప్లాట్‌ఫాంలపైకి వచ్చే రైలులోని ఏ బోగి ఎక్కడ నిలుస్తుందో తెలియక ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు.

సరిహద్దులోని రైల్వే స్టేషన్.. ప్రయాణికుల పరేషాన్

బాసర రైల్వేస్టేషన్ తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో ఉంది. ఇక్కడి ట్రిపుల్‌ఐటీలో 9 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తారు. ఇందులో పనిచేసే అధ్యాపకులు, ఆయా విభాగాల సిబ్బంది రైలు మార్గం ద్వారా రాకపోకలు కొనసాగిస్తారు. ఉత్తర, దక్షిణ భారతాలను కలుపుతూ బాసర మీదుగా రాకపోకలు సాగించే రైళ్లలో నిత్యం సుమారు 4వేలకు పైగా ప్రయాణికులు వెళ్తుంటారు. ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతుండగా నిత్యం రద్దీగా ఉండే ఈ స్టేషన్‌లో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీఇన్నీ కావు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయించి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్లాట్‌ఫాంపై అర్ధంతరంగా నిలిచిన టైల్స్ పనులు

‘ఆదివాసీ నాయకులపై చర్యలు తీసుకుంటాం’



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ పెద్దలు

ఇంద్రవెల్లి: ఏజెన్సీ చట్టాలను దుర్వినియోగం చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులపై చర్యలు తీసుకోనున్నట్లు రాయిసెంటర్ జిల్లా మేడి మెస్రం దుర్గు, తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో గొండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు నాయకులు ఆదివాసీ పెద్దల తీర్మానాలు పట్టించుకోకుండా, నోటీసులిచ్చినా ఆదివాసీ సమావేశాలకు దూరంగా ఉంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. త్వరలో వారిపై కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందోర్ బాదిరావ్, రాయిసెంటర్ సార్‌మేడి మెస్రం వెంకట్‌రావ్, ఆయా గ్రామాల పెద్దలు పుర్క బాపురావ్, వెట్టి రాజేశ్వర్, ఆదివాసీ సంఘాల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

గోండుగూడ శివారులో అస్తిపంజరం

కాసిపేట: మండలంలోని గోండుగూడ శివారు వాగు ఒడ్డున పురుషుడి అస్తి పంజరం లభించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం మామిడిగూడ గ్రామపంచాయతీ పరిధి గోండుగూడ శివారు వాగు ప్రాంతంలో కుళ్లిన మృదేహం చూసిన పెద్దనపల్లికి చెందిన నవీన్ పంచాయతీ కార్యదర్శి శ్వేతకు ఫోన్‌లో సమాచారమిచ్చాడు. కార్యదర్శి పోలీస్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. 40 ఏళ్ల పురుషుడి మృతదేహంపై బ్లూ కలర్ షర్టు, బ్లాక కలర్ ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. నెల క్రితం మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఓసీపీ మట్టి కుప్ప పై నుంచి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా? ఇతర కారణాలతో చనిపోయాడా? అనేది తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహం కుడి కాలు, ఎడమచేయి ఫ్రాక్చర్‌తో ఇనుపప్లేట్లు అమర్చి ఉన్నట్లు పేర్కొన్నారు.

‘ఉదారి’కి రాష్ట్రస్థాయి పురస్కారం



ఉదారి నారాయణ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకు చెందిన ప్రముఖ కవి ఉదారి నారాయణ తెలంగాణ సారస్వత పరిషత్ అవార్డుకు ఎంపికైనట్లు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చిన్నయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నారాయణ రచించిన ‘మళ్లీ మనిషిలోకి..’ గ్రంథం రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారంతోపాటు రూ.20 వేల నగదు అందజేసి శాలువా, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు తెలిపారు. నారాయణ ఇప్పటివరకు ఏడు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు, ఎనిమిది ఉత్తమ కవిత పురస్కారాలు అందుకున్నారు. నారాయణకు జిల్లా కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో ఇఫ్టూ నిరసన



నిరసన తెలుపుతున్న ఇఫ్టూ నాయకులు

బెల్లంపల్లి: లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా వేయడంపై ఇఫ్టూ శ్రేణులు మంగళవారం బెల్లంపల్లి సివిక్ కార్యాలయం ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 20న దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టాల్సి ఉండగా కేంద్ర కార్మిక సంఘాలు వాయిదా వేశాయని తెలిపారు. ఈ తీరును తాము తీవ్రంగా నిరసిస్తున్నామని పేర్కొన్నారు. భారత్–పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు చెప్పడం సరికాదని తెలిపారు. ప్రస్తుతం దేశంలో సాధారణ పరిస్థితులున్నా సమ్మె వాయిదా వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు టీ శ్రీనివాస్, నాయకుడు ఎండీ చాంద్‌పాషా, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణవేణి, వెంకటి, కొమురయ్య, భాను ప్రసాద్, కుమార్, లింగన్న, పద్మ, సునీత, అమృత, కరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్‌షాప్‌లో భారీ అగ్ని ప్రమాదం



స్క్రాప్ షాప్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లోగల ఇండస్ట్రియల్ ఏరియాలోని స్క్రాప్ షాప్‌లో షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. వివరాలు.. పట్టణానికి చెందిన షేక్ ఫాజిల్ స్థానిక సోఫీనగర్‌లో స్క్రాప్ దుకాణం నడుపుతున్నాడు. మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో దుకాణం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన వాచ్‌మన్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.7లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్ అధికారులు అంచనా వేశారు. ఎవరికి ఎలాంటి హాని జరగలేదని తెలిపారు.


ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి



సురేశ్ మృతదేహం

తలమడుగు: ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొలాంగూడ గ్రామానికి చెందిన సీడాం సురేశ్ (22) కొన్నేళ్లుగా బరంపూర్ గ్రామానికి చెందిన లింగారెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ట్రాక్టర్‌ను అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుకొంటూ బరంపూర్ నుంచి పల్లి గ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న మెరుగు ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రవీణ్‌ను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. సురేశ్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాధిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్త్రీ చేస్తూ కరెంట్ షాక్‌తో ఒకరి దుర్మరణం



ముత్యం (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని సుంక్లీ గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఒకరు మృత్యువాత పడ్డారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరిగెల ముత్యం (42) మంగళవారం రోజులాగే తన ఇంటి వద్ద ఎలక్ట్రికల్ ఇస్త్రీపెట్టెతో బట్టలు ఇస్త్రీ చేస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు ముత్యంను చికిత్స కోసం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



అచ్యుతానంద్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–బాసర మార్గంలో భోకర్ చౌరస్తా సమీపంలోగల పెట్రోల్ పంపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాలేగాంకు చెందిన పవార్ అచ్యుతానంద్ పాటిల్ (46) మంగళవారం సాయంత్రం భోకర్ చౌరస్తా వద్ద గల పెట్రోల్‌పంపు నుంచి రోడ్డుపైకి వస్తున్నాడు. ఈ సమయంలో బాసర వైపు నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ఘటనలో అచ్యుతానంద్ పాటిల్ కింద పడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆటోలో ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు సమీప బంధువు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, పరిచయస్తులు భారీగా ఆస్పత్రికి చేరుకున్నారు.

కంటైనర్‌ను ఢీకొని యువకుడు..



శాంతిస్వరూప్ (ఫైల్)

నేరడిగొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన శాంతిస్వరూప్ (18) మంగళవారం ద్విచక్రవాహనంపై నిజామాబాద్‌కు వెళ్లి డిగ్రీ ఎంట్రన్స్ పరీక్ష రాసి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను గమనించక ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శాంతిస్వరూప్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఉదయం పేపర్ బాయ్‌గా పని చేయడంతోపాటు ఆదిలాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. అతడి మరణాన్ని కుటుంబీకులు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతదేహాన్ని ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

తానూరు: మండలంలోని కోలూరు గ్రామానికి చెందిన రుద్రముడ్ గంగాధర్‌పై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన రుద్రముడ్ అశోక్, అతడి భార్య కౌసల్య, పెద్ద కుమారుడు సుధాంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న రుద్రముడ్ అశోక్ పొలంలోని ఒడ్డుపై ఉన్న వేపచెట్టు కొట్టివేస్తున్నాడు. ఇంతలో వరుసకు సోదరుడైన గంగాధర్ వచ్చి చెట్టు ఎందుకు కొట్టివేస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో గంగాధర్‌పై అశోక్ తోపాటు అతడి భార్య కౌసల్య, పెద్ద కుమారుడు సుధాం గంగాధర్‌పై రాళ్లతో దాడి చేశారు. గంగాధర్‌కు తీవ్ర గాయాలు కాగా కుటుంబీకులు అతడిని చికిత్స కోసం భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంగాధర్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దాడికి పాల్పడ్డ అశోక్, కౌసల్య, సుధాంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా



రోడ్డుపై బోల్తా పడిన లారీ

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని యాపల్ ప్రాంతంలో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున లారీ బోల్తా పడింది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కైకలూరు నుంచి చేపల లోడుతో అమృత్‌సర్ (బెల్లంపలి వైపు) వెళ్తున్న లారీని డ్రైవర్ నిద్రమత్తులో నడుపుతుండగా అది అదుపుతప్పి యాపల్ ప్రాంతంలో రోడ్డు పక్కనున్న రెయిలింగ్‌ను ఢీకొని బోల్తా పడింది. బోల్తాపడ్డ లారీని గమనించక వెనుక నుంచి బొలెరో ఢీకొంది. బొలెరో వెనుక మరో లారీ నిలిచి ఉండగా దానిని డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో, లారీ డ్రైవర్లకు గాయాలయ్యాయి. కిలోమీటర్ మేర వాహనాలు నిలిచి ట్రాఫిక్ జామ్ కాగా ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిద్రమత్తులో అజాగ్రత్తగా లారీ నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ దగ్ధం



కాలిపోతున్న ట్రాక్టర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన బోగె శంకర్‌కు చెందిన ట్రాక్టర్ ప్రమాదవశాత్తు కాలిపోయింది. వివరాలు.. మంగళవారం ఒత్కుపల్లి సమీపంలో ట్రాక్టర్‌తో డ్రైవర్ దుక్కి దున్నుతుండగా డీజిల్ అయిపోయింది. డ్రైవర్ వెళ్లి డీజిల్ తీసుకుని వచ్చేసరికి ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌కు మంటలు అంటుకున్నాయి. ఆర్పే ప్రయత్నం చేసినా లాభం లేకుండా పోయింది. అప్పటికే ట్రాక్టర్ కాలిపోయింది. ట్రాక్టర్ విలువ సుమారు రూ.8లక్షల వరకు ఉంటుందని బాధితుడు శంకర్ తెలిపాడు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక



ఎంపికైన జట్లతో అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి ఎస్‌ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాలలో మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు సత్తా చాటాలని సూచించారు. పతకం సాధించి జిల్లా క్రీడా పతాకాన్ని రాష్ట్ర స్థాయిలో ఎగురవేయాలని పిలుపునిచ్చారు. జూనియర్ బాలబాలికల జట్లు ఈ నెల 28నుంచి 30వరకు నల్గొండ జిల్లా నకిరేకల్‌లో నిర్వహించనున్న 47వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటాయని తెలిపారు. జట్లకు ఈ నెల 22నుంచి 27వరకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రెఫరీ బోర్డు చైర్మన్, హ్యాండ్‌బాల్ కోచ్ అరవింద్ సునార్కర్, జాతీయ క్రీడాకారులు రాకేశ్, సాయి, కార్తిక్, సంజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

జూనియర్ బాలికల జట్టుకు..

జూనియర్ బాలికల జట్టుకు డీ శృతి, డీ మౌనిక, అనూష, జే అశ్విత, పీ శృతి, డీ వర్ష, ఎం.కుమారి, బీ మమత, కే స్వీటీ (మంచిర్యాల), ఏ రేణుక, టీ సౌమ్య, కే మల్లిక (కుమురంభీం ఆసిఫాబాద్), పీ సింధు, కే చైతన్య, ఆర్.మైత్రి (ఆదిలాబాద్), సీ సుధ (నిర్మల్) ఎంపికయ్యారు.

జూనియర్ బాలుర జట్టుకు..

జే రవివర్మ, డీ సందేశ్, టీ అరవింద్, జే కార్తిక్, శ్రావణ్, ఎల్.సుందర్, ఎస్.పవన్ (మంచిర్యాల), కే రాంకుమార్, ఎస్.భానుప్రసాద్, డీ యోగి, డీ ఈశాంత్, జే సాయికిరణ్, పీ కార్తిక్ (కుమురంభీం ఆసిఫాబాద్), జే కళ్యాణ్, కే రాకేశ్, (ఆదిలాబాద్), ఆర్.రమేశ్ (నిర్మల్) ఎంపికయ్యారు.

పసికందు పాల కోసం ఆవు విరాళం



ఆవును అందజేస్తున్న ఈశ్వరీబాయి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తిప్పకొలంగూడ గ్రామానికి చెందిన ఆత్రం రాణిబాయి ఏప్రిల్ 18న ఆడపిల్లకు జన్మనిచ్చింది. మే 15న రాణిబాయి అనారోగ్యంతో మృతి చెందింది. పాపకు జన్మనిచ్చిన నెలలోపే రాణిబాయి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి ఇటీవల పరామర్శించారు. పాలకోసం ఆ చిన్నారి పడే తపనను చూసి చలించారు. పాపకు పాలు అందించేందుకు ఓ ఆవును కొనిస్తానని బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. మంగళవారం ఓ ఆవుతో పాటు లేగదూడను ఆ చిన్నారి తండ్రి ఆత్రం కృష్ణ, తాత, నానమ్మ కటోడ బూరిబాయికి అందించారు. ఈ సందర్భంగా ఈశ్వరీబాయికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టోర్నమెంట్ సక్సెస్ చేయాలి



మాట్లాడుతున్న బాలూరి గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జూన్ 6 నుంచి 8 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం టోర్నమెంట్ నిర్వహణపై సమావేశమై చర్చించారు. గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. టోర్నమెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 10 జిల్లాల నుంచి జట్లు హాజరుకానున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు అన్ని వసతుల కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, హాకీ శిక్షకులు పాల్గొన్నారు.

పశువుల పాకలు దగ్ధం



కాలిపోయిన పశువుల పాకలు

బోథ్: సొనాల మండల కేంద్రానికి చెందిన అన్నదమ్ములైన రేంజర్ల సుదర్శన్, రేంజర్ల రాములుకు చెందిన రెండు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి పశువుల పాకకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో పశువులు అరవగా స్థానికులు గమనించి సుదర్శన్, రాములుకు తెలిపారు. ఇచ్చోడలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఉదయం వరకు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా పాకలు పూర్తిగా దగ్ధమయ్యాయి. పశువులకు ఎలాంటి ప్రాణహాని సంభవించలేదు. వ్యవసాయ పనిముట్లు, పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. రూ.5లక్షల నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా టెంబీ గ్రామానికి చెందిన జాదవ్ శేషారావు (60) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. శేషారావు కూతుళ్ల వివాహాలు చేసి అప్పులపాలయ్యాడు. మానసిక వేదనతో మద్యానికి బానిసయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక సోమవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పేకాడుతూ ఆరుగురి అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్‌లో ఓ ఇంట్లో పేకాడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వారి నుంచి రూ.1,860 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.